క్లుప్తంగా

హరితహారం చెట్ల నరికివేత



జడ్చర్ల: గోప్లాపూర్‌లో హరితహారం కార్యక్రమంలో ఐదు సంవత్సరాల క్రితం నాటిన చెట్లను ఇటీవల కొందరు నరికి వేసి సొమ్ము చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అంతర్గత రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లను నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఎక్కడికక్కడ నరికివేశారని ఆరోపించారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



అడ్డాకుల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని అర్చన రాష్ట్రస్థాయి డ్రాయింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జ్యోతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం మందిరంలో విద్యాశాఖ, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు వివరించారు. 28న రాష్ట్రస్థాయిలో పోటీల్లో అర్చన పాల్గొననున్నట్లు తెలిపారు. మంగళవారం విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

సమావేశానికి తరలిన రేషన్ డీలర్లు



మహమ్మదాబాద్: రాష్ట్రస్థాయి సమావేశంలో పాల్గొనేందుకు మంగళవారం మహమ్మదాబాద్ నుంచి రేషన్ డీలర్లు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. రఘు, నరేందర్, గోపాల్, వెంకటేష్, చెన్నయ్య, వెంకటరెడ్డి, రాంచందర్, కష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన నాయకులు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రొఫెసర్, ఎమ్మెల్సీ కోదండరాంను టీఎస్‌జీఓ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్, కోశాధికారి కృష్ణమోహన్, అసోసియేషట్ అధ్యక్షులు శ్యాంసుందర్ రెడ్డి, దివ్య, ఉపాధ్యక్షుడు యుగేందర్ నాయుడు, జాయింట్ సెక్రటరీ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి



జడ్చర్ల టౌన్: సిగ్నల్‌గడ్డపై 167వ నంబరు జాతీయరహదారి పనులు త్వరగా పూర్తిచేయాలని ఆ శాఖ డీఈ రమేష్‌బాబు, ఏఈ రవిలను బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కోరారు. రోడ్డు పనులు పరిశీలించేందుకు జడ్చర్ల సిగ్నల్‌గడ్డకు వచ్చిన ఆయనను కలుసుకున్న నాయకులు సమస్యలను విన్నవించారు. ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా వర్షాలు వచ్చినపుడు చాలా సమస్యలు వస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కాగా రైల్వే అనుమతుల కారణంగా పనులు ఆలస్యం అవుతున్నట్లు డీఈ వారికి తెలియజేశారు. బీటీ పనులు త్వరితగతిన పూర్తిచేయిస్తామని వివరించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, పి.మురళి, రఘుపతిరెడ్డి, రామ్మోహన్, ఇంతియాజ్ ఉన్నారు.

ఎదురుచూపులు ఇంకెన్నాళ్లు?



ఊరంచుతండాలో నిర్మించిన పంచాయతీ భవనం

నవాబుపేట: మండల పరిధిలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. రూ. లక్షలు అప్పులు చేసి ఖర్చులు చేస్తే.. పదవీకాలం ముగిసినా కూడా ఇప్పటికీ డబ్బులు రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. తాము పదవిలో ఉన్న సమయంలో అదిగో.. ఇదిగో అంటూ అధికారులు కాలయాపన చేశారని.. తాజాగా బిల్లుల విషయంపై అడిగితే కొత్త సర్కారు కదా కాస్తా ఆలస్యంగా వస్తాయంటూ సమాధానం దాటవేస్తున్నారని వాపోతున్నారు. పదవీ కాలం పూర్తయి కూడా నెలలు గడిచినా బిల్లులు ఊసే లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది పల్లెప్రగతితో గ్రామాల్లో అభివృద్ధి పనులను పోటీపడి పూర్తి చేశామని.. అందుకోసం అప్పులు చేశామని చెబుతున్నారు. శ్మశానవాటికలు, సెగ్రిగేషన్ షెడ్లు, పంచాయతీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం పనులకు వెచ్చించామని అంటున్నారు. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వీరందరికీ బకాయిల భయం పట్టుకుంది. ప్రభుత్వం బిల్లులు ఇస్తుందా లేదా అన్న అయోమయం ఓ వైపు.. చేసిన అప్పులు ఎలా తీర్చాలన ఆందోళన మరోవైపు వారిని వెంటాడుతోంది.

- మండలంలో మొత్తం 54 పంచాయతీలలో పంచాయితీరాజ్ శాఖ ద్వారా 24 గ్రామాలు, ఉపాధి పథకంలో 30 గ్రామాల్లో పల్లెప్రగతి పనులు చేపట్టారు. కాగా నేటికి పంచాయతీలకు రూ. కోటి వరకు మాత్రమే అదికూడా కొన్నింటికే వచ్చాయి.
- మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలకు సంబంధించి పంచాయతీలకు రూ. 2లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాది గడుస్తున్న బిల్లులు రాలేదు.
- సీసీరోడ్లకు సంబంధించి ప్రతి పంచాయతీలో రూ.2 లక్షల నుంచి రూ.5లక్షల వరకు రావాల్సి ఉంది. ఇవి సైతం ఏడాదిన్నర కావస్తున్నా ఒక్క బిల్లు కూడా అందలేదు. ఇలా గ్రామాల్లో చేసిన పనులకు సంబంధించి మండలంలోని మాజీ సర్పంచ్‌లకు దాదాపుగా రూ. 10 కోట్లకు పైగానే బిల్లులు రావాల్సి ఉందని సమాచారం. ఈ క్రమంలో ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని మాజీ సర్పంచ్‌లు కోరుతున్నారు.

రూ. 25 లక్షలు రావాలి



గ్రామంలో చేపట్టిన పనులకు సంబంధించి రూ. 25 లక్షల వరకు రావాల్సి ఉంది. పనులు చేసి రెండేళ్లు కావస్తోంది. ఇప్పటికీ బిల్లులు రావడం లేదు. అధికారులు స్పందించటం లేదు. వేగంగా పూర్తి చేయాలంటూ నిత్యం ఇబ్బందులు పెట్టి పను లు చేయించిన అధికారులు.. తీరా పూర్తి చేశాక గ్రామాల వైపు చూడటం లేదు. అప్పులు చేసి అభివృద్ధి పనులకు వెచ్చించాం. ఇప్పటికైనా బకాయిలు చెల్లించాలి.

– వెంకటేష్, మాజీ సర్పంచ్, జంగమయ్యపల్లి

అవస్థలు పడుతున్నాం



మేము పదవిలో ఉన్నప్పుడు బిల్లులపై అధికారులను అడిగేవాళ్లం. మాజీలుగా మారాక కూడా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. రూ. లక్షలు అప్పులు చేసి అవస్థలు పడుతున్నాం. పోటీ పడి పనులు పూర్తి చేసినా.. బిల్లులు ఇవ్వకపోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఉంది.

–గోపాల్‌గౌడ్, మాజీ సర్పంచ్, నవాబుపేట

ఉన్నతాధికారులకు వివరిస్తాం

గతంలో ఉన్న సర్పంచ్‌లు చేసిన పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. చాలా గ్రామాల మాజీలు బిల్లుల కోసం రోజూ ఆరాతీస్తున్నారు. విషయంపై ఉన్నతాధికారులకు వివరిస్తాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే వాటిని పనిచేసిన వారికి అందిస్తాం. గ్రామాల వారీగా ఉన్న బకాయిలపై ఆరాతీసి నివేదిక తయారుచేస్తాం.

– జయరాంనాయక్, ఎంపీడీఓ, నవాబుపేట

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత



దేవరకద్ర: అడవి అజిలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులకు మంగళవారం టై, బెల్టులు, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ వెంకటయ్యగౌడ్ జ్ఞాపకార్థం వారి కుమారులు మాధవులుగౌడ్, రాఘవేందర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, కృపార్‌గౌడ్ కలిసి కార్యక్రమం చేపట్టారు. హెచ్ఎం హరీష్‌కుమార్, ఉపాధ్యాయులు గౌరీశంకర్‌రావు, భీమ్‌సేన్, రమ, మేరీ గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



రాజాపూర్: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరు ప్రతిన భూనాలని అదనపు కలెక్టర్ (స్థానికసంస్థలు) శివేంద్రప్రతాప్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో.. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులను ఆయన పరిశీలించారు. ప్రజలు తడి, పొడి చెత్తలను వేరుచేసి పంచాయతీ ట్రాక్టర్‌లో వేసేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామస్తులకు అవగాహన కల్పించుటలో మహిళా సంఘాల సభ్యులు భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మశ్చందర్, ఎంపీఓ వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పీయూలో పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. కోఆర్డినేటర్ ప్రవీణ, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, శివకుమార్‌సింగ్, జ్ఞానేశ్వర్, గాలెన్న, రామ్మోహన్, సిద్ధరామగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌లో..

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అధ్యాపకులు పద్మ, అనురాధ, అమీనాముంతాజ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కనీసం ఇద్దరు టీచర్లు ఉండాల్సిందే..

నవాబుపేట: ప్రతి పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భూపతిసింగ్ సూచించారు. మంగళవారం మండలకేంద్రంలో సమావేశంలో మాట్లాడారు. 20 మంది విద్యార్థులకు అదనపు ఉపాధ్యాయుడి నియామకం జరిగితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఆయన వివరించారు. ఇటీవల జారీ చేసిన 1297 జీఓపై మరోసారి ఆలోచించాలని కోరారు. రమాకాంత్, శ్యాంసుందర్‌రెడ్డి, నజీర్ తదితరులు ఉన్నారు.

ఉప్పొంగిన కచ్చా కాల్వ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక వార్డు నం.46 పరిధిలోని కొత్తచెరువు నిండి అలుగు పారుతుండటంతో దిగువకు వరద వస్తోంది. దీంతో 200 మీటర్ల కచ్చా కాల్వ పొంగి సమీప ఇళ్ల అంచు వరకు చేరి ఫార్మేషన్ రోడ్డుపైకి నీరు వస్తోంది. మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పి.విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. జేసీబీతో రోడ్డుకు అడ్డంగా ఉన్న సిమెంట్ పైపులను తొలగింపజేశారు. ఇళ్లలోకి వరద చేరకుండా నివారణ చర్యలు చేపట్టారు. చుట్టుపక్కల వారికి ఎలాంటి ప్రమాదం లేదని వారు పేర్కొన్నారు. కాగా, ఈ వరద నీరు పాటు కాల్వల ద్వారా పెద్దచెరువుకు ఒకవైపు రామయ్యబౌలి వద్ద ఉన్న తూము నుంచి కిందికి వెళుతోంది. ఇటీవల పెద్దచెరువు పూర్తిగా నిండగా ఈ తూము తెరిచిన విషయం విదితమే. అలాగే బీకే రెడ్డికాలనీ వైపు ఉన్న అలుగు తూమును మూసివేసి శివశక్తినగర్ మార్గంలో బాక్స్ కల్వర్టు పనులు కొనసాగిస్తున్నారు. ఇదిలాఉండగా సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి గణేష్‌నగర్‌లోని ఓ వీధిలో ఓపెన్ నాలా మురుగుతో పాటు వరద రోడ్డుపై పొంగి పొర్లింది. సాయంత్రం అక్కడికి మున్సిపల్ అధికారులు, సిబ్బంది వెళ్లి వరద నీరు సాఫీగా ముందుగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.



వరద నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

పెద్దవాగుకు మళ్లీ వరద



కందూర్ వద్ద పెద్దవాగులో వరద



కోడ్గల్ వద్ద దుందుభీలో..

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విస్తరించి ఉన్న పెద్దవాగుకు మళ్లీ వరద వస్తోంది. సోమవారం రాత్రి మూసాపేట, భూత్పూర్ మండలాల్లో వర్షం కురవడంతో ఎగువ నుంచి వరద వస్తోంది. రెండు మండలాల్లో వాగులో నిర్మించిన చెక్‌డ్యాంలు మళ్లీ నిండుగా ప్రవహిస్తున్నాయి. అడ్డాకుల మండలంలోని పొన్నకల్, గుడిబండ, రాచాల, కన్మనూర్, ముత్యాలంపల్లి, వర్నె, బలీదుపల్లి మీదుగా వరద నీళ్లు దిగువన ఉన్న సరళాసాగర్ ప్రాజెక్టుకు వెళ్తున్నాయి. ఇదిలా ఉండగా కొమిరెడ్డి పల్లి నుంచి పెద్దవాగు కాల్వ ద్వారా పొన్నకల్ చెరువుకు నీళ్లు వెళ్తున్నాయి. కాగా రెండు మండలాల్లోని చెరువు నిండుకుని అలుగు పారుతున్నాయి. గత నెల 23న ఈ ఏడాది మొదటి సారి వాగు పెద్ద ఎత్తున పారింది. సుమారు వారం పాటు వాగు నిండుగా ప్రవహించింది. తర్వాత మళ్లీ మంగళవారం వాగులో వరద కనిపించింది.

ఉధృతంగా దుందుభీ

జడ్చర్ల టౌన్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని దుందుభీనది ఉధృతంగా పారుతోంది. నెలరోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు దుందుభీ ఉధృతంగా పారుతుండటంతో తీరప్రాంతాల్లోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోడ్గల్, లింగంపేట, నెక్కొండ, ఆల్వాన్‌పల్లి వద్ద చెక్‌డ్యాంల మీదుగా వాగు ప్రవహిస్తుంది. కోడ్గల్ వద్ద బ్రిడ్జికి ఆనుకుని వరదనీరు ప్రవాహం కొనసాగుతుంది. ఇక నెక్కొండ, లింగంపేట, మీనాంబర పరుషవేదీశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న చెక్‌డ్యాంల వద్ద అడుగు ఎత్తులో వరదనీరు పారుతుంది. వరద నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

నీటి సరఫరాలో అంతరాయం ఉండరాదు

భూత్పూర్: గ్రామీణ ప్రాంతాలల్లోని ప్రజలకు నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలు సూచనలు చేశారు. అనంతరం ట్రైనర్ శ్రీనివాస్ నీటి ట్యాంకుల శుద్ధి చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితరాలను వివరించారు. ఎంపీడీవో ప్రభాకర్, ఎంపీవో శ్రీదేవి, మిషన్ భగీరథ ఏఈఈ ఉమర్, వివిధ గ్రామాలకు చెందిన వాటర్‌మెన్‌లు పాల్గొన్నారు.

వాగును పరిశీలించిన అధికారులు



వంతెన వద్ద అధికారులు

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రం నుంచి ఇస్రంపల్లి గ్రామానికి వెళ్లె దారిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును మంగళవారం తహసీల్దార్ ఎల్లయ్య ఇతర అధికారులు పరిశీలించారు. వాగు వంతెనపై నుంచి పారడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు వాహనాల రాక పోకలు నిలిపి వేయాలని సూచించారు. అలాగే పిల్లలు కూడ వాగు వైపు రాకుండా చూడాలని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా కాపాలాదారులను ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. సోమవారం రాత్రి దేవరకద్ర, కౌకుంట్ల మండలాల్లో 58 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు మళ్లీ పొంగి పొర్లుతున్నాయి.

కేంద్రం చేసే పనులు ప్రజలకు తెలియాలి

దేవరకద్ర: కేంద్ర ప్రభుత్వం చేసే పనులకు సంబంధించి వాస్తవాలు ప్రజలకు తెలపాలని ఎంపీ డీకే అరుణ కోరారు. మంగళవారం దేవరకద్రలోని డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి నివాసంలో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలదే అన్నారు. మిషన్ భగీరథ పథకంలో పని చేసేందుకు గ్రామానికి ఒకరి చొప్పున మనం కూడా నియమించవచ్చని తెలిపారు. సమావేశంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు యజ్ఞభూపాల్‌రెడ్డి బీజేపీ సభ్యత్వం ఎంపీ చేతుల మీదుగా తీసుకున్నారు. అలాగే డిజిటల్ సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు. పలువురికి ఎంపీ స్వయంగా సభ్యత్వాలను ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, నియోజకవర్గ బీజేపీ ఇంచార్జీ కొండ ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణంరాజు, నాయకులు రాచాలరాజు, నాగిరెడ్డి, దేవన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

మిడ్జిల్: మండల తహసీల్దార్‌గా రాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ రాజునాయక్ మూసాపేట్‌కు బదిలీ అయ్యారు. కాగా భూత్పూర్‌లో విధులు నిర్వహిస్తున్న రాజు బదిలీపై ఇక్కడికి వచ్చారు.

నవాబుపేట: మండల తహసీల్దార్‌గా శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేవరకద్రలో విధులు నిర్వహించిన శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. కాగా ఇక్కడ విధులు నిర్వహించిన నాగ్యానాయక్ దేవరకద్రకు బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్ శ్రీనివాస్‌ను డీటీ గాయత్రీ, ఆర్ఐ కిరణ్ తదితరులు సన్మానించారు.

భూత్పూర్: మండల తహసీల్దార్‌గా రహ్మాన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం నుంచి బదిలీపై ఆయన భూత్పూర్‌కు వచ్చారు. సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

ఈదమ్మ హుండీ ఆదాయం రూ.72,500

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఈదమ్మ ఆలయం హుండీని మంగళవారం లెక్కించారు. ఈమేరకు 72,500 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ శంకర్ తెలిపారు. గత 6 నెలల హుండీ ఆదాయాన్ని గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించామని వివరించారు.

ఈ-చలాన్స్‌పై ప్రత్యేక డ్రైవ్

మహబూబ్‌నగర్ క్రైం: పాలమూరు పట్టణంలో పెండింగ్ ఈ-చలాన్స్‌పై మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వన్‌టౌన్ పోలీసులు వన్‌టౌన్ చౌరస్తాలో ప్రత్యేక తనిఖీలు చేశారు. ట్రాఫిక్ పోలీసులు సుభాష్ చంద్రబోస్ చౌరస్తా, రూరల్ పోలీసులు శ్రీనివాస కాలనీ దగ్గర ద్విచక్ర వాహనాలు తనిఖీ చేశారు. ఈనెల 28న లోక్ అదాలత్ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు పెండింగ్ ఈ-చలాన్స్, ఎంవీఐ యాక్ట్ కేసులపై తనిఖీలు చేసినట్లు వివరించారు.

అద్దెకు వచ్చి.. బైక్ చోరీ

మిడ్జిల్: మండల కేంద్రంలో ఇంటి అద్దెకు వచ్చి యజమాని బైక్‌ను చోరీ చేసిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మిడ్జిల్‌కు చెందిన నర్సింహ తన ఇంటిని గుర్తు తెలియని ఓ వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. కాగా ఈ నెల 19న ఉదయం ఆ వ్యక్తి తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ అయిపోయిందని నర్సింహ దగ్గరకు వచ్చాడు. అతడి బైక్ తీసుకుని పెట్రోల్ కోసం వెళ్లాడు. ఎంతసేపటికీ తిరిగి రాలేదు. దీంతో బైక్ చోరీకి గురైందని గుర్తించిన నర్సింహ కొన్నిరోజుల పాటు వెతికినా లాభం లేకపోయింది. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

నిస్వార్థంగా సేవ చేయాలి



జడ్చర్ల టౌన్: బీఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ప్లాస్టిక్ సేకరించి మున్సిపాలిటీ వారికి అందజేశారు. అనంతరం సమావేశంలో ప్రిన్సిపాల్ సుకన్య మాట్లాడారు. నిస్వార్థంగా సేవ చేయాలని సూచించారు. ఎన్ఎస్ఎస్‌లో ఒక్కసారి వలంటీర్‌గా చేరితే జీవితాంతం ఉండవచ్చన్నారు. వలంటీర్లకు ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. డా.నందకిశోర్, డా.మాధురి, డా.సదాశివయ్య, ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నివేదికలు తయారు చేయాలి



రాజాపూర్: పీఎం కిసాన్ యోజన అర్హులను గుర్తించి వెంటనే నివేదికలు తయారు చేయాలని జడ్చర్ల డివిజనల్ ఏడీఏ ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం రంగారెడ్డిగూడ రైతు వేదికలో బాలానగర్, రాజాపూర్ మండలాల వ్యవసాయశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని సూచనలు చేశారు. ముఖ్యంగా రైతుబీమా పథకం క్లెయిమ్ డాక్యుమెంట్స్‌ను త్వరగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. డిజిటల్ క్రాప్ సర్వేకోసం నూతనంగా ఆవిష్కరించిన యాప్‌ను ఏఈఓలు వినియోగించి నమోదు ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు ప్రదీప్‌గౌడ్, సుజాత, దీపికాగౌడ్, ప్రత్యూష, శ్రీనివాస్, రమేష్, మహేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్స్ అందజేత



దేవరకద్ర: పేరూర్‌లో మంగళవారం గ్యాస్ సిలిండర్ సబ్సిడీ ప్రొసీడింగ్స్‌ను టీపీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి అందజేశారు. పంచాయతీ కార్యదర్శి అశోక్, నాయకులు శ్రీనివాసులు, శ్రీనివాస్, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండలకేంద్రంలో మంగళవారం లబ్ధిదారులకు అధికారులు ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశారు. ఎంపీడీఓ సురేందర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఎస్ వెంకటేష్, మహిమూద్, శివ, బాల్‌రాజు ఉన్నారు.

సమయపాలన పాటించాలి



గండీడ్: ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సీఎంఓ బాలు యాదవ్ అన్నారు. మంగళవారం గండీడ్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషిచేయాలన్నారు. పాఠశాల ఆవరణకు సరిపోయేలా మొక్కలు నాటించాలన్నారు. మండల కేంద్రంలో ప్రారంభించనున్న కేజీబీవీ కోసం గుర్తించిన అద్దె భవనాన్ని పరిశీలించారు. మరమ్మతు పూర్తి చేయాలని సూచించారు. నోడల్ అధికారి జనార్దన్ కాంప్లెక్స్ హెచ్ఎం విజయలక్ష్మి, కేజీబీవీ ప్రత్యేక అధికారి శివలీల పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్



రాజాపూర్: విద్యతోనే భవిష్యత్ ముడిపడి ఉందని ఎస్వీకేయం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబినేజర్ పేర్కొన్నారు. విద్యారంగంపై దూరదృష్టి కలిగిన మేధావులతో మమేకం కావడంతో ఎంతో గొప్ప అనుభవం పొందినట్లు వివరించారు. మంగళవారం చెన్నై ఐటీసీ గ్రాండ్ వేదికగా నిర్వహించిన 30వ ఎడిషన్ ఎలైట్ వరల్డ్ ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో రాష్ట్రం నుంచి పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఏస్వీకేయం పాఠశాల, ఎస్ఎంబీఎంఎస్ లాంటి యూనివర్సిటీ ఏర్పాటు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.